క్లుప్తంగా

పది కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, ఆటోతో ఇన్‌స్పెక్టర్ రెడ్డి త్రినాథ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఆటోలో తరలిస్తున్న పది కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని అరెస్టుకు చేసి కోర్టులో హాజరుపర్చారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి త్రినాథ్, సిబ్బంది కోలమూరు గ్రామ పరిధిలోని గామన్ బ్రిడ్జి సమీపంలో రూట్‌వాచ్ చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఆటోను తనిఖీ చేయగా పది కేజీల గంజాయి బయటపడింది. దీంతో గంజాయిని, ఆటోను స్వాధీనం చేసుకుని, దానిలో ఉన్న సింగిరామ్ మణికంఠ (మండపేట), పెండెం వేణు (జంగారెడ్డిగూడెం మండలం రావికంపాడు)ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు.

రక్తదానం మహోన్నతం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం మహోన్నతమైనదని స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, గౌతమీ జీవకారుణ్య సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత ప్రతి మూడు మాసాలకు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలను అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కానుబోయిన సాగర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ సింగంపల్లి, మన బాధ్యత ఫౌండేషన్ అధ్యక్షుడు గారా అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ: ఆదాయపు పన్ను శాఖలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించేందుకు గురువారం సదస్సు నిర్వహించనున్నట్టు చాంబర్ సెక్రటరీ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మెయిన్ రోడ్డులోని రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ డి.హేమభూపాల్ రానున్నారన్నారు. వర్తక సోదరులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఉద్యోగం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగం పర్మినెంట్ చేయిస్తానని చెప్పి తనను వశపర్చుకుని, చివరకు మోసం చేశాడంటూ పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌పై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరుకు చెందిన ముత్యాల అరుణకుమారికి ఇద్దరు పిల్లలు. ఆమె భర్త పదేళ్ల క్రితం వదిలి వెళ్లిపోయాడు. ఆమె 2021 నుంచి కడియం పేపరుమిల్లులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్ జైన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆమె ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తానని, ఆమె కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ముఖేష్‌జైన్‌ను ఆమెను వశపర్చుకున్నాడు. ఇప్పుడు ఉద్యోగం గురించి అడుగుతుంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ విషయాన్ని పేపరుమిల్లు జీఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

కంబాలచెరువు: లలితానగర్‌లోని ఒక ఇంటిలో కుళ్లిన మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు మంగళవారం కనుగొన్నారు. వివరాల్లోకి వెళితే.. గతంలో భవన నిర్మాణ, కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన నాళం వెంకటేశ్వరరావు (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. వెంకటేశ్వరరావుకు కుమార్తె ఉంది. ఆమె అప్పుడప్పుడూ వచ్చి తండ్రి ఆరోగ్యం చూసి వెళుతుంటుంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వచ్చి వెళ్లింది. అయితే మంగళవారం వెంకటేశ్వరరావు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. వారు వచ్చి తలుపులు తెరవగా కుళ్లిపోయిన స్థితిలో వెంకటేశ్వరరావు మృతదేహం కనిపించింది. పోలీసులు ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాపాడి కోలేక..

- ఎండుగడ్డికి డిమాండ్
- విపరీతంగా పెరిగిన ఖర్చులు
- పాడి పరిశ్రమకు రైతులు దూరం



వరి పొలాల్లో ఎండుగడ్డిని తగలబెడుతున్న దృశ్యం

కడియం: వ్యవసాయం, పశుపోషణ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఈ రెండింటినీ సక్రమంగా నిర్వహిస్తే రైతులకు ఆదాయ మార్గాలు బాగుంటాయి. పూర్వకాలంలో వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ పశువులను మేపేవారు. పొలంలోనే పశువుల పాకలను ఏర్పాటు చేసుకునేవారు. సాగులో పంటల ద్వారా వచ్చిన ఆదాయంతో పాటు పశువుల పాలను విక్రయించడం ద్వారా అదనపు సొమ్ములు వచ్చేవి. కానీ నేడు పశుపోషణ బాగా తగ్గిపోయింది. మేత ఖర్చులు పెరిగిపోవడంతో పశువుల పెంపకానికి చాలామంది దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా ఎండుగడ్డి దొరకడం గగనంగా మారింది. దొరికినా దాని ధరను చూసి బెంబేలెత్తుతున్నారు.

యంత్రాల వినియోగం

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. మనుషులకు బదులు యంత్రాల వినియోగం ఎక్కువైంది. కూలీల కొరతతో పాటు పెరిగిన కూలి ఖర్చులు కూడా దీనికి కారణం. కూలీలతో కన్నా మెషీన్‌తో కోయిస్తే తొందరగా పని జరగడంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. దీంతో మెషీన్లతో పనిచేయించుకునేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

మేత దొరకడం గగనమే

గతంలో వరిని కూలీలలో కోయించేవారు. ఆ పనలను కుప్పలుగా వేసి, నూర్పిళ్లు చేసేవారు. అనంతరం ధాన్యాన్ని బస్తాల్లో నింపి విక్రయాలు జరిపేవారు. దీనికి ఎక్కువ రోజులు పట్టేది. కానీ నేడు మెషీన్లు గంటల్లోనే పంటను కోసి, ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్నాయి. అయితే ఈ విధానంలో ఎండుగడ్డి పనికి రాకుండా పోతుంది. దీంతో పశువులకు మేత దొరకడం కష్టమవుతోంది. రైతులందరూ మెషీన్లతో కోత కోయించడంతో ఎండగడ్డికి డిమాండ్ ఏర్పడింది. దాన్ని కొనుగోలు చేసి, పశువులను మేపడం కష్టంగా ఉంటోంది. దీంతో చాలామంది రైతులను పాడికి దూరంగా ఉంటున్నారు.

పెరిగిన ఖర్చులు

ఒక ఎకరం విస్తీర్ణంలో సేకరించిన ఎండుగడ్డితో సుమారు ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు ఒక పశువును మేపుకోవచ్చు. ప్రస్తుతం ఒక ఎకరంలో ఎండుగడ్డిని కొనుగోలు చేయాలంటే రూ. 6 వేల నుంచి రూ. 8 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మెషీన్‌తో కోతలు పూర్తయ్యాక చేలల్లో నుంచి ఎండుగడ్డిని సేకరించి మేటుగా వేయించడానికి దాదాపు రూ.6 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. గడ్డి మోపులు గట్టే యంత్రాలు కూడా అందుబాటులోకి వచ్చినప్పటికీ ఖర్చు అదే స్థాయిలో ఉండడంతో ఎండగడ్డిని సేకరించేందుకు రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

గడ్డిని తగలబెడితే నష్టం

పంట భూముల్లోనే ఎండుగడ్డిని తగలబెట్టేందుకు కొందరు మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల పెట్టుబడి ఖర్చులు మిగులుతాయని భావిస్తున్నారు. అయితే గడ్డిని తగుల బెట్టడం ద్వారా నేల పైపొరల్లో పంటల ఎదుగుదలకు తోడ్పడే సూక్ష్మజీవరాశి దెబ్బతింటుంది. తద్వారా సాగు చేసే పంటలకు తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో పాటు సూక్ష్మ పోషక లోపం ఏర్పడుతుందన్నారు. పర్యావరణం కూడా దెబ్బతిని కాలుష్యం ఏర్పడుతుంది. ఈ అనర్థాలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నా పూర్తిస్థాయిలో ఫలితం ఉండడం లేదు. వాతావరణ పరిస్థితులతో పాటు పలు కారణాలతో ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన దిగుబడులు రాలేదు. ఎకరాకు 32 బస్తాలకు లోపు దిగుబడి వచ్చింది. ఈ సమయంలో ఎండుగడ్డిని సేకరించి మేటుగా వేయాలంటే అదనంగా పెట్టుబడి పెట్టాలని రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

అదనపు ఖర్చు

కూలి పనికి వెళుతూ రెండెకరాల్లో వరిని సాగుచేస్తున్నాను. కూలిపనికి, పశుపోషణకు కుదరకపోవడంతో ఉన్న గేదెలను కూడా అమ్మేశాను. సాగు చేసిన రెండెకరాల్లోని వరి గడ్డిని సేకరించాలంటే ఎకరాకు 5,500 వరకూ ఖర్చు అవుతుంది. అంత పెట్టుబడి పెట్టలేక తగలబెట్టేశాను.

– కె.వీరబాబు, జేగురుపాడు.

తోటి రైతుకు ఇచ్చేశాను

నా తోటి రైతు పశువులను మేపుతున్నాడు. అతడికి అవసరమని అడగడంతో నేను సాగు చేసే చేలో ఎండుగడ్డిని ఇచ్చేశాను. మూడెకరాల్లో ఎండుగడ్డిని ఒబ్బిడి చేసి, మేటుగా వేసుకునేందుకు ఆయనకు దాదాపు రూ.18 వేలకు పైగా ఖర్చయ్యింది.

– టి.మణికుమార్, మురమండ

17న వివిధ వస్తువులకు బహిరంగ వేలం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ (ఇన్‌చార్జి) ఎం.అబ్దుల్ ఖదీర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్‌ఫ్యాక్టరీ పక్కన ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఈ వేలంలో 141 ఫ్రీజర్లు (ఒక్కింటికి నిర్ణయించిన ధర రూ.22,680), 132 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు (ఒక్కొక్కటీ రూ.18,630), 145 క్యాష్ చెస్టులు (ఒక్కొక్కటీ రూ.6,120), 287 స్కానర్లు (ఒక్కొక్కటీ రూ.3,400), 132 క్యాష్ కౌంటింగ్ మెషీన్ల (ఒక్కొక్కిటీ రూ.810)కే వేలం వేస్తామన్నారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారంగా వేలం జరుగుతుందని తెలిపారు. పాల్గొనే వారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుముగా రూ. 5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాడుకున్న తర్వాత వస్తువుల ధర మొత్తాన్ని 18 శాతం జీఎస్‌టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాటపాడు కొని వారికి దరఖాస్తు రుసుము తిరిగి చెల్లిస్తారన్నారు. పూర్తి సమాచారం కోసం 94407 85620, 95059 68533, 99493 51052 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జోన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వై.చైతన్య మురళి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సౌత్‌స్టేషన్ పరిధిలోని పిడింగొయ్యి, రఘునాథపురం, శ్రీరాంపురం, చక్రద్వారబంధం గ్రామాల్లోని శివారు అటవీ ప్రాంతాలలో మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 7,200 లీటర్లను బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన మట్టా మణికంఠను అరెస్టు చేసి, రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచారు. దాడులలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ రాహుల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నూకరాజు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.అనుశ్రీ, కొవ్వూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సౌత్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బిరెడ్డి, నార్త్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి త్రినాథ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు లేని మనిషి బొనిసతో సమానం




సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: హక్కులు లేని మనిషి బానిసతో సమానమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. దానవాయిపేటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం మానవ హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ మానవుడు స్వతంత్రంగా జీవించి, తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు ఊతమిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్షకు గురి కాకుండా సమాన హక్కులతో జీవించాలని చెప్పారు. ఎవరికి ఎలాంటి న్యాయ సమస్యలు, సందేహాలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు కల్పించడానికి అధికారులు బాధ్యతాయుత పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు.

కేసులపై సమీక్ష

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ కేసులలో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయ కుమారి, సీడీపీవో నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా నేరగాళ్లు అనేక మార్గాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లలో వ్యక్తిగత చిత్రాలను, వివరాలను పంపవద్దన్నారు. కొత్త కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, తెలియని వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. సైబర్ క్రైమ్ టీం సభ్యులు సైబర్ క్రైమ్స్, సైబర్ సెక్యూరిటీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవులకృష్ణా.. గోపాలకృష్ణా..



జీయర్ స్వామి ప్రసంగిస్తుండగా వేదిక వద్దకు వచ్చిన గోవులు

రాజవోలు గ్రామంలోని గాయత్రీ నగర్ రామాలయం దగ్గర అహోబిల రామానుజ జీయర్ స్వామి శ్రీమద్భాగవత సప్తాహం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆసక్తికర సంఘటన జరిగింది. స్వామి ప్రసంగిస్తుండగా వేదిక వద్దకు గోమాతకు వచ్చాయి. వాటిని చూసి భక్తులు చాలా సంతోషించారు. గోపాలుని కథన వినడానికి ఈ గోవులు వచ్చాయంటూ ఆనంద పడ్డారు.

– రాజమహేంద్రవరం రూరల్

జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడల నివారణ



డీఎఫ్ఆర్‌సీలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు



డీఎఫ్ఆర్‌సీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఆర్కిడ్స్‌ను పరిశీలిస్తున్న రైతులు

- డీఎఫ్ఆర్‌సీ శాస్త్రవేత్తలు
- రైతులకు అవగాహన సమావేశం

కడియం: జీవ నియంత్రణ పద్ధతులతో ఉద్యాన పంటలను ఆశించే చీడపీడలను నివారించవచ్చని డివిజనల్ ఫ్లోరీకల్చర్ రీసెర్చి సెంటర్ (డీఎఫ్ఆర్‌సీ) శాస్త్రవేత్తలు అన్నారు. వేమగిరిలోని ఆ కేంద్రంలో మంగళవారం జీవనియంత్రణ చర్యల ప్రాధాన్యతపై శిక్షణ నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీవీఎస్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నర్సరీలు, పూలు, ఉద్యాన పంటలను సాగు చేసే రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూల పంటలు, నర్సరీ మొక్కలకు ఆశించే తెగుళ్లు, చీడపీడలు, వాటి నష్ట తీవ్రతను నివారించే యాజమాన్య పద్ధతులను వివరించారు. పూల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు హానికర రసాయన మందుల పిచికారీని అదుపులో ఉంచుకోవాలన్నారు.

నివారణా చర్యలపై అవగాహన

నెమటాలజిస్టు డాక్టర్ టి.శిరీష మాట్లాడుతూ పూల మొక్కలను ఆశించే నులి పురుగులు, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా వాటిని నివారించే విధానాన్ని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవన్ మాట్లాడుతూ పూలు, అలంకరణ మొక్కలను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలను తెలిపారు. ఒకవేళ రసాయన పురుగు మందులను వినియోగించాల్సి వస్తే నిర్ణీత ప్రమాణాల ప్రకారం శాస్త్రవేత్తలు సూచించిన మోతాదు మేరకు మాత్రమే వాడాలన్నారు. కడియం మండలం ఉద్యాన అధికారి డి.సుదీర్ మాట్లాడుతూ బిందు, సూక్ష్మ సేద్యం ఉపయోగాలను వెల్లడించారు. ఉద్యాన శాఖ ద్వారా అందించే రాయితీలపై రైతులకు అవగాహన కల్పించారు. పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రాంపాల్, లక్ష్మీపతి మాట్లాడుతూ డీఎఫ్ఆర్‌సీలో శాస్త్రవేత్తల పర్యవేణలో సాగవుతున్న గులాబీ, ఆర్కిడ్స్, మురాలియా, లిల్లీ తదితర రకాలను రైతులకు చూపించారు. వాటిని అభివృద్ధి విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో కడియం, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల పరిధిలోని నర్సరీ రైతులు, ఉద్యాన వన సిబ్బంది, విస్తరణ అధికారులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గోపిమూర్తికి స్వాగతం

కడియం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన పీడీఎఫ్ అభ్యర్థి బి.గోపిమూర్తికి సోమవారం అర్ధ రాత్రి వేమగిరిలో ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన కాకినాడ నుంచి రాజమహేంద్రవరం పీడీఎఫ్ హోమ్‌కు వస్తుండగా స్వాగతం చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


సమర్థంగా ఇంటింటా చెత్త సేకరణ



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ఇంటింటా చెత్త సేకరణను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య విభాగం అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆ విభాగం అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ తగినంత మంది సిబ్బంది, వాహనాలు ఉన్నప్పటికీ ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగడం లేదని గమనించామన్నారు. ఒక వేళ చెత్త సేకరించే వాహనాలు రిపేరులో ఉంటే వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలన్నారు. వాహనాల కదలికలకు సంబంధించిన రిపోర్టును ప్రతి రోజు సాయంత్రం సమర్పించాలన్నారు. కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, చెత్తను రోడ్లపై వేసే వారికి భారీ జరిమానాలు విధించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వితరణ



వృద్ధులకు వితరణ చేస్తున్న భవతీరామ్, గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం ఉన్ని దుస్తులు, కాస్మొటిక్స్, నగదు వితరణ చేశారు. ఆశ్రమం నిర్వాహకుడు గుబ్బల రాంబాబు కుమార్తెల పుట్టిన రోజును పురస్కరించుకుని వీటిని అందజేశారు. ఆయన చిన్న కుమార్తె భవతీరామ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమకు ఇచ్చిన నగదును సేవా కార్యక్రమాలకు కేటాయిస్తామన్నారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తన కుమార్తెలిద్దరూ తాను చేస్తున్న సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు.

ఏకాది లగ్జరీ సిల్వర్ స్టోర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న హీరోయిన్ నిధి అగర్వాల్, జక్కంపూడి రాజా, వేణుగోపాలకృష్ణ, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే అన్ని రకాల ఆభరణాలతో ఏకాది లగ్జరీ బ్రాండ్ సిల్వర్ స్టోర్ ఫ్రాంచైజీ మంగళవారం రాజమహేంద్రవరంలో ప్రారంభమైంది. స్థానిక విజయ టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన స్టోర్‌ను ఇస్మార్ట్ మూవీ హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ ఏకాది లగ్జరీ బ్రాండ్ సిల్వర్ స్టోర్‌లో నాణ్యమైన వస్తువులు అందరికీ అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ఎండీ వేణు గోపాల్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో తొలి ఏకాది లగ్జరీ సిల్వర్ స్టోర్ ప్రారంభించామని, ఇక్కడ అన్ని రకాల ఆభరణాలు అందుబాటు ధరల్లో ఉంటాయన్నారు. స్టోర్ ఫ్రాంచైజీ నిర్వాహకులు సింధు సహస్ర, కార్తిక్ మాట్లాడుతూ సిల్వర్ కలెక్షన్స్‌లో ప్యూర్ గోల్డ్‌లోని వెరైటీలు తయారు చేయడం ఏకాది సిల్వర్ జ్యూవెలరీ ప్రత్యేకత అన్నారు. ప్రతి రూ.25 వేల కొనుగోలుపై రూ.2,500 గిఫ్ట్ వోచర్, ప్రతి రూ.50 వేల కొనుగోలుపై అర గ్రాము గోల్డ్ కాయిన్, ప్రతి రూ.లక్ష కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ప్రారంభ ఆఫర్‌గా ఖాతాదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ సంక్రాంతి వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ రావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, సీసీసీ ఛానల్ అధినేత పంతం కొండలరావు, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, ఇన్నీసుపేట బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ/రాజమహేంద్రవరం సిటీ: భారత రాజ్యాంగ చట్టాలను, కోర్టు తీర్పులను సక్రమంగా అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పోలవరం నిర్వాసితుల హక్కుల ఉల్లంఘనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనలో ప్రభుత్వాలే మొదటి స్థానంలో ఉన్నాయని ఆరోపించారు. తాము చేసిన చట్టాలను, ఇచ్చిన ఉత్తర్వులను అవే ప్రభుత్వాలు అమలు చేయకపోవడం మావసహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంపై మరో శ్వేతపత్రం విడుదల చేసి కేంద్రం ఇస్తున్న రూ.12,517 కోట్లలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి, భూసేకరణకు చేసే కేటాయింపులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెల్లెం శేఖర్, సంతోష కుమారి, గడుతూరి చిన్నారావు, అరగంటి వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

వినూత్నంగా మానవ హక్కుల దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులతో మానవ హక్కుల గురించి చెప్పించడం ఆకట్టుకుంది. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి నైతిక విలువలు అవసరమన్నారు. అలాగే మానవ హక్కుల ఆవశ్యకతను వివరించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు సయ్యద్ ఫరా ఎస్రూన్ మాట్లాడుతూ పిల్లలలో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు, మానవ హక్కులను ఉల్లంఘించకుండా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన రాజనీతి శాస్త్ర విభాగాన్ని కొనియాడారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మల్లన్న సత్తా

ప్రకాశం నగర్: లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థి చెల్లబోయిన గౌరీపతి లింగేశ్వర మల్లన్న మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటాడు.
2024 సంవత్సరానికి గాను సబ్ జూనియర్ నేషనల్ ఉషు మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఈ విషయాన్ని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సరితా రంజని మంగళవారం ప్రకటనలో తెలిపారు. పంజాబ్‌లో డిసెంబర్ ఒకటి నుంచి ఆరో తేదీ వరకూ నిర్వహించిన పోటీల్లో మల్లన్న ఈ ఘనత సాధించాడన్నారు. మల్లన్న రెండేళ్లుగా ఆర్.సుందరం వద్ద శిక్షణ పొందుతున్నాడన్నారు.